ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
సోమవారం 23 సెప్టెంబరు 2024

బస్సులో రూ. 2 లక్షలు మర్చిపోయిన ప్రయాణికుడు
- అందజేసిన మంథని డీఎం శ్రావణ్‌కుమార్

దేవుడి సొమ్ము విక్రయించే యత్నం
- స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగింత

7లో..

రుడా
Ramagundam Urban Development Authority
ఏర్పాటుకు అడుగులు

- పెద్దపల్లి, మంథని మున్సిపాలిటీల పరిధికి విస్తరణ
- 5లక్షల జనాభాతో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి కసరత్తు

కోల్‌సిటీ, సెప్టెంబరు 22: రామగుండం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ(రుడా) ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. పట్టణీకరణ నేపథ్యంలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రాధాన్యమిస్తున్నాయి. ఈక్రమంలోనే దీర్ఘకాలంగా ప్రతిపాదనలో ఉన్న రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ తెరమీదికి వచ్చింది. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ 'రుడా' ఏర్పాటు గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపాల్సిందిగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆధ్వర్యంలో జిల్లా, పట్టణ ప్రణాళికల అధికారులు కసరత్తు చేస్తున్నారు. 5లక్షల జనాభాతో 'రుడా' ఏర్పాటు చేయాలని ప్రాథమిక అంచనాలతో ఉన్నారు.

నాలుగు నియోజకవర్గాల పరిధిలో..

పెద్దపల్లి జిల్లా విస్తీర్ణం 2,236 చదరపు కిలోమీటర్లు. రామగుండం నగరపాలక సంస్థతో పాటు పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు, పలు మేజర్ గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇప్పటికే కీలకమైన రాజీవ్ రహదారి ఉంది. దీంతో పాటు మంచిర్యాల-వరంగల్ జాతీయ రహదారి మంథని నియోజకవర్గంలోని గ్రామాల గుండా వెళుతుంది. ఎన్టీపీసీ, రామగుండం ఎరువుల కర్మాగారం, సింగరేణి కాలరీస్, కేశోరాం సిమెంట్స్, జెన్‌కో విద్యుత్ కేంద్రాలతో పాటు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలున్నాయి. కొత్తగా కోకాకోలా, సాఫ్ట్‌వేర్ కంపెనీలు కూడా జిల్లాలో ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. వీటితోపాటు కొత్తగా బీథర్మల్ కేంద్రం స్థానంలో 800మెగవాట్ల విద్యుత్ ప్లాంట్, మేడిపల్లి ఓసీపీ స్థానంలో 500మెగావాట్ల సంపుడ్ స్టోరేజ్ ప్లాంట్‌కు కూడా ప్రతిపాదించారు. జిల్లా కేంద్రం పరిసరాలతో పాటు రామగుండం, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలతో పాటు ప్రధాన రహదారి కనెక్టివిటీ ఉన్న అన్ని ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలు ఊపందుకున్నాయి. ఈ పరిస్థితుల్లో రామగుండం నగర పాలక సంస్థతో పాటు పెద్దపల్లి, మంథని మున్సిపాలిటీలు, అంతర్గాం, పాలకుర్తి, ధర్మారం, కమాన్‌పూర్, రామగిరి, మంథని మండలంలోని పలు గ్రామాలను కలుపుతూ రామగుండం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. 2021 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 7,59,332 జనాభా ఉంటే, రామగుండం నగరపాలక సంస్థ పరిధి లోనే 2,29,644 జనాభా ఉంది. జల్లారం, కుందనపల్లి, లింగాపూర్, పెంచికలపేట, రాయదండి, సుందిళ్ల తదితర గ్రామాలను కలుపుకుని మెట్రోపాలిటన్ జనాభా 2,52,308గా ఉంది. 2024 జనాభా అంచనా ప్రకారం రామగుండం మెట్రోపాలిటన్ జనాభా 3,57,000గా ఉంటుందని అంచనా. మంథని 15కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండగా 2021జనాభా లెక్కల ప్రకారం 17,927గా ఉంది. ప్రస్తుతం 24వేల జనా భా ఉంటుందని అంచనా. అలాగే 26.19 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంగల పెద్దపల్లి మున్సిపాలిటీలో 56వేల జనాభా ఉంది. వీటితోపాటు మంథని రెవెన్యూ మండలం లోని సూరయ్యపల్లి, ఎగ్లాస్‌పూర్, పుట్టపాక, సిద్ధిపల్లి, మల్లేపల్లి, నాగారం, సిరిపురం, గుంజపడుగు గ్రామాలు కూడా 'రుడా' పరిధిలోకి వచ్చే అవకాశం ఉంది. కమాన్‌పూర్ మండలంలోని గుండారం, రాణాపూర్, రొంపికుంట, పెద్దంపేట, జూలపల్లి, రాణాపూర్, కన్నాల, రామగిరి మండలంలోని 17గ్రామాలు 'రుడా' పరిధిలోకి వచ్చే అవకాశం ఉంది. లొంకకేశారం, రత్నాపూర్, నాగేపల్లి, నవాబ్ పేట్, బేగంపేట, బుధవారంపేట, ఆదివారంపేట, రాజాపూర్, లద్నాపూర్, సుందిళ్ల, ముస్త్యాల, జల్లారం, వెంకట్రావ్‌పల్లి వరకు పరిధి ఉండే అవకాశం ఉంది.

అభివృద్ధికి నేరుగా నిధులు..

కేంద్ర ప్రభుత్వం పట్టణీకరణ పెరుగుతున్నందు వల్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేయాలని సూచన చేసింది. ఈ మేరకు పలు పథకాలను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో అమలుచేస్తున్నారు. వరంగల్ కాకతీ య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) తరువాత కరీంనగర్‌లో శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) ఏర్పాటుచేశారు. ఇటీవలే వరంగల్ మహా నగర్ పేర 'కుడా'ను కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్ వరకు విస్తరిస్తున్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ ఏర్పాట్ల వల్ల రహదారుల విస్తరణ, అభివృద్ధి, కొత్త రహదారుల ఏర్పాటు, లేఅవుట్ల అభివృద్ధి, చెరువులు, నీటి వనరుల పరిరక్షణ, సెంట్రల్ లైటింగ్‌లు, మాస్టర్ ప్లాన్ ప్రకారం జోన్‌ల ఏర్పాటు వంటి అవకాశాలుంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపాలిటీలతో పాటు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ లకు నేరుగా విడుదల చేస్తాయి. ఇప్పటికే గ్రామాల్లో సైతం ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ఎల్‌ఆర్‌ఎస్, ఇంటి నిర్మాణ అనుమతులను ప్రవేశపెట్టింది. 'రుడా' ఏర్పాటుతో వ్యాపార సంస్థలు విద్యా సంస్థలు, తదితర ఏర్పాట్లు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి వస్తాయి.



మల్లన్న సన్నిధిలో భక్తుల మొక్కులు



మల్లికార్జున స్వామి ఆలయంలో పట్నాలు వేయిస్తున్న భక్తులు

ఓదెల, సెప్టెంబరు 22 : భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి, స్వామివారికి మొక్కలను సమర్పించారు. మొక్కుకున్న మేరకు భక్తులు మల్లికార్జున స్వామి, అలాగే మదన పోచమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. అనంతరం బంగారు పోచమ్మ, సీత రాముల వారి ఆలయాలను దర్శించుకున్నారు.

అపూర్వ సమ్మేళనం



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కోల్‌సిటీ టౌన్, సెప్టెంబర్ 22: గోదావరిఖని ఉజ్వల హైస్కూల్‌లో పదవ తరగతి 2000-01 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరికొకరు కష్టాలు సుఖాలను పంచుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకున్నారు. చదువు చెప్పిన గురువులను సన్మానించారు. అనంతరం ఆనందంగా డాన్సులు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సింహాచలం రత్నాకర్, తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, రవికుమార్, శ్రీవిద్య, లక్ష్మి, మాధవి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రజక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయండి
- మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 22: రాష్ట్రంలో రజక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆదివారం ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు రజక సంఘం జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు పెండ్యాల మహేష్ వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి 10సంవత్సరాలు దాటిందని, గత ప్రభుత్వం రజకులను పూర్తిగా విస్మరించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అణగారినవర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తోందని, రజకుల కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటుచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ, వైద్య, రాజకీయపరంగా రజకులను ప్రోత్సహించాలని మంత్రిని కోరారు. కోటిలోని ఉమెన్స్ కళాశాలకు చాకలి ఐలమ్మ పేరు పెట్టడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సచ్‌దేవా పాఠశాలలో చిత్రలేఖనం పోటీలు

జ్యోతినగర్, సెప్టెంబరు 22: ఎన్టీపీసీ టీటీఎస్‌లోని సచ్‌దేవా స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎన్టీపీసీ ఏటీఎం హెచ్‌ఆర్ విజయకుమార్ సిద్దర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆన్‌ది స్పాట్ డ్రాయింగ్ పోటీల్లో పాల్గొని ఉత్తమంగా వేసిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు.

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రికి ఘన స్వాగతం



కమాన్‌పూర్‌లో కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

కమాన్‌పూర్, సెప్టెంబర్ 22 : కమాన్‌పూర్ మీదుగా భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండలానికి వెళ్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు ఆదివారం బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు శాలువాతో సత్కారించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు జంగపల్లి అజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము, నాయకులు భూంపెల్లి మొండయ్య, బర్ల సది, వడ్లకొండ తిరుపతి, మల్లారపు అరుణ్, చిప్పకుర్తి సతీష్, జంగపల్లి శ్రీనివాస్, కొయ్యడ సతీష్, విశ్వతేజ, లక్ష్మణ్, స్వామి, మోరే ప్రశాంత్, బత్తుల సమ్మయ్య తదితరులు ఉన్నారు.

మంథని : స్థానిక పాత పెట్రోల్ పంపు చౌరస్తాలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆదివారం స్వాగతం పలికారు. మహదేవపూర్ జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొనేందు వెళ్తున్న కేంద్ర మంత్రి బండికి బీజేపీ పార్టీ శ్రేణులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన కాన్వాయిలో మహదేవపూర్ వెళ్లారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 22: ప్రధాని నరేంద్రమోదీ దేశంలో ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి వెళ్లి వివరించాలని బీజేపీ సభ్యత్వ అభియాన్ ఇన్‌చార్జి క్యాతం వెంకటరమణ వివరించారు. ఆదివారం తిలక్‌నగర్ మండల అధ్యక్షులు గోపగోని నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో 45వ డివిజన్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకటరమణ హాజరై మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక సభ్యత్వ నమోదును లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చల్లా రాజు, భాస్కర్, రాజు, సురేష్, కిశోర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుల నిర్మూలన సదస్సును జయప్రదం చేయండి

అంతర్గాం, సెప్టెంబరు 22: మహాత్మా జ్యోతిబా పూలే స్థాపించిన సత్యశోధక సమాజ్ కుల నిర్మూలన సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి కే రాజన్న అన్నారు. ఆదివారం అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటలోని భగత్‌సింగ్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 29న పెద్దంపేటలో జరిగే కుల నిర్మూలన సదస్సుకు మండలంలోని ప్రజలంతా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు ఈదునురి నరేష్, ఐ కృష్ణ, కొల్లూరి మల్లేష్, మెరుగు చంద్రయ్య, ఆనంద్, సమ్మెట తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మీదనే కూరగాయల వారసంత
- ఇబ్బందుల్లో ప్రజలు, వ్యాపారస్థులు

ధర్మారం, సెప్టెంబర్ 22 : ధర్మారం మండల కేంద్రంలో రాష్ట్ర రహదారిపై కూరగాయల వార సంత కొనసాగుతోంది. ఇక్కడ కనీసం సౌకర్యాలు కూడా లేకపోవడంతో వ్యాపారస్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది సంవత్సరాల నుంచి రాష్ట్ర రహదారిపైనే వారసంత కొనసాగడం వలన వచ్చేపోయే వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీకి ఆదాయం వస్తున్నా కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ సిబ్బంది స్పందించి వార సంతలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని వ్యాపారస్థులు కోరుతున్నారు.

పెద్దపల్లి మార్కెట్ కమిటీలో చోటు..

ఓదెల, సెప్టెంబరు 22 : మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్దపల్లి మార్కెట్ కమిటీలో ఐదుగురికి చోటు లభించింది. పొత్కపల్లి నుంచి సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి, ఓదెల నుంచి గోపతి సదానందం, గూడెం గ్రామం నుంచి తిప్పారపు ప్రభాకర్, కొలనూర్ నుంచి కొల్లూరి రామచంద్రం, పిట్టల ఎల్లయ్యపల్లి నుంచి పిట్టల కొమురయ్యలను పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.

ఏఈవోల సమస్యలు పరిష్కరించాలని వినతి



జిల్లా వ్యవసాయాధికారికి వినతిపత్రం అందిస్తున్న ఏఈవోలు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 22: క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు అధిక పని ఒత్తిడితో సతమవుతున్నారని, ఏఈవోల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఈవోలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న అనేక కార్యక్రమాలను విజయవంతం చేస్తూ ప్రముఖ పాత్ర పోషి స్తున్నామని, సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వ్యవహరిస్తోంద న్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు సమస్యలను పరిశీలించి ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒకరి చొప్పున గ్రామ వ్యవసాయ సహాయకులను నియమించాలని డిమాండ్ చేశారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ శాఖలో వెయ్యి ఎకరాలకు ఒక వీఏఏలను నియమించారని ఈ అంశాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆలోచించి నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు వినయ్, శిరీష పాల్గొన్నారు.


మరమ్మతులకు నోచుకోని చెక్‌డ్యాములు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



మంగపేట శివారులో కూలిన చెక్‌డ్యాం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 22: మండలంలోని మంగపేట, కాల్వశ్రీరాంపూర్ గ్రామాల శివారులోని హుస్సేన్‌మియా వాగులో నిర్మించిన చెక్‌డ్యాంలు కూలిపోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో హుస్సేన్‌మియా వాగులో మూడు చెక్‌డ్యాంలు మంజూరయ్యాయి. ఈ ప్రాంతం ఎస్‌ఆర్‌ఎస్‌పీ టేలాండ్ ప్రాంతంకావడంతో వాగు పరివాహక ప్రాంత రైతులకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సాగు నీరందించేందుకు చెక్ డ్యాంలు మంజూరు చేసింది. మంగపేట, కాల్వశ్రీరాంపూర్ శివారులోని వాగులో సుమారు రూ.15కోట్లతో అప్పటి ప్రభుత్వం రైతుల సాగునీటి నిలువ కోసం ఈ చెక్‌డ్యాంలు నిర్మించింది. అయితే సంబంధిత కాంట్రాక్టర్ చెక్‌డ్యాంలు కట్టిన సంవత్సరం తిరగక ముందే అప్పటి ప్రభుత్వంలో అధిక వర్షాలతో వాగు పొంగడంతో మంగపేట, కాల్వశ్రీరాంపూర్‌లో ఉన్న రెండు చెక్ డ్యాంలు కుప్పకూలిపోయాయి. చెక్‌డ్యాంలను నాణ్యత లేకుండా కట్టడం వలన ప్రభుత్వ కోట్లాది రూపాయల నిధులు నీళ్ల పాలయ్యాయి. మంగపేట, పెగడపల్లి రెండు గ్రామాల మధ్య వాగులో నిర్మించిన చెక్‌డ్యాం నాణ్యత లేకపోవడంతో కూలడంతో పెగడపల్లి గ్రామానికి తాగునీరు అందించే బావి, గ్రామ పంచాయతీ వేసిన షెడ్డు ఆనవాళ్లు లేకుండా వాగులో కొట్టుకపోయాయి. తాగునీటి బావిలో ఇసుక మేటలు వేసింది. దీంతో పెగడపల్లి గ్రామ ప్రజలు తాగునీటికి ఇబ్బంది తప్పలేదు. అప్పటి గ్రామపంచాయతీ పాలకవర్గం తాగునీరు అందించేందుకు ఇసుక మేటలు వేసిన బావిలో యుద్ధ ప్రాతిపదికన ఇసుక తీయించి, తాత్కాలికంగా మరొక బావిని వాగులోనే తవ్వించి తాగునీరు అందించారని గ్రామ ప్రజలు తెలియజేశారు. అదేవిధంగా కాల్వశ్రీరాంపూర్‌లో రెండు చెక్ డ్యాంలు నిర్మించగా ఒక చెక్‌డ్యాం నాణ్యత లేని కారణంగా అది కూడా కూలిపోయింది. వరదల కారణంగా చెక్‌డ్యామ్ కూలిపోయి హుస్సేన్‌మియా వాగు పక్కన ఉన్న రైతుల పొలాల వెంట వాగు పొంగి ఇసుక మేటలు వేసింది. దీంతో రైతులు పంట పొలాలతో పాటు భూములు కూడా నష్టపోయారు. నాణ్యత లేని ఈ చెక్ డ్యామ్ కారణంగా హుస్సేన్‌మియా వాగు పక్కన ఉన్న బంగారు రమేష్ రైతుకు చెందిన ఎకరం భూమి వాగు పొంగి ఇసుక మేటలు వేయడంతో రైతు భూమిని వదిలేశాడు. రైతుల పాలిట శాపంగా మారిన ఈ చెక్‌డ్యాములు కాంట్రాక్టర్‌కు వరంగా మారాయి. వర్షాలు బాగా కురిసి వాగులు పొంగినప్పుడు కూలిన చెక్ డ్యాముల కారణంగా వాగు నీరు పొంగి పంట పొలాల నుంచి ప్రవహిస్తోందని ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మంగపేట, కాల్వశ్రీరాంపూర్ శివారులో హుస్సేన్‌మియావాగులో కూలిన చెక్‌డ్యాంలను మరమ్మతులు చేయించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



జీవో 25ను రద్దు చేయాలి

జమ్మికుంట రూరల్ సెప్టెంబరు 22: రాష్ట్ర ప్రభుత్వం జీవో 25ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను రక్షించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి డిమాండ్ చేశారు. జమ్మికుంట పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీవో 25ను తీసుకువచ్చి పాఠశాల ఉపాధ్యాయులను సర్దుబాలు ప్రక్రియ మొదలు పెట్టిందన్నారు. జీవో ప్రకారం 1నుంచి10 మంది పిల్లలు ఉంటే ఒక ఉపాధ్యాయుడు 11-60కి ఇద్దరు, 61-90కి ముగ్గురు, 91-120 నలుగురు, 121-150 ఐదుగురు ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉంటుందన్నారు. 60మంది పిల్లలు ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులు పని చేయాలంటే ఎలా సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏబూషి శ్రీనివాస్, సదానందం, సంపత్, ఉమ, ఎం శ్రీనివాస్, బలరాం, కనకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజికి మృతదేహం అప్పగింత

వీణవంక, సెప్టెంబర్ 22: మండలంలోని కొండపాక గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ అవాల మణెమ్మ (80) అనారోగ్యంతో మృతి చెందింది. 2014లో కొండపాక ఎంపీటీసీగా పని చేసింది.కు 'టుంబ సభ్యులు మణెమ్మ కోరిక మేరకు అర్‌వీఎం మెడికల్ కళాశాలకు అప్పగించారు. మణెమ్మ కుటుంబసభ్యులను ఎంపీ ఈటల రాజేందర్ ఫోన్‌లో పరామర్శించారు. పలువురు నాయకులు మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

పిడుగుపాటుకు గేదె మృతి



మృతి చెందిన గేదె వద్ద రైతు

తిమ్మాపూర్, సెప్టెంబరు 22: మండలంలోని రామకృష్ణ కాలనీ గ్రామంలో ఆదివారం పిడుగుపడి అలువాల గంగయ్య అనే రైతుకు చెందిన గేదె మృతి చెందింది. మృతి చెందిన గేదె సుమారు 70వేల రూపాయల విలువ ఉంటుందని ప్రభుత్వం తనను అదుకోవాలని రైతు గంగయ్య విజ్ఞప్తి చేస్తున్నాడు.





క్షమాభిక్షతో అక్రమ వలసదారులకు ఊరట

- జరిమానా రద్దుచేసిన యూఏఈ - 22రోజుల్లో అవుట్ పాస్‌పోర్ట్‌కోసం వేలాది దరఖాస్తులు

- భారత రాయబార కార్యాలయాల వద్ద పెరిగిన రద్దీ



సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 22: యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో ఇటీవల ప్రకటించిన క్షమాభిక్షతో అక్రమ వలసదారులకు ఊరట లభించింది. ఈ సందర్భంగా యూఏఈని అక్రమవలసదారులకు విధించే జరిమానాను రద్దు చేసింది. ఈనెల 1నుంచి అమ్నెస్టీ ప్రకటించిన 22రోజుల్లో దాదాపు 20 వేలకు పైగా అక్రమవలసదారులు అవుట్‌పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేశారని జనరల్ డైరెక్టరేట్ ఆఫ్ రెసిడెన్సీ అండ్ ఫారిన్ ఎఫైర్స్(జీడీఎఫ్ఆర్‌ఏ) వెల్లడించింది. దీంతో దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయాల వద్ద రద్దీ పెరిగింది. ఇప్పటికే అనేకమంది అవుట్‌పాస్‌పోర్ట్ తీసుకొని ప్రవాస తెలంగాణ కార్మికులు దుబాయ్‌నుంచి తిరుగుముఖం పడుతున్నారు.

● 20వేల మంది..

దుబాయ్‌లో తెలంగాణకు చెందిన దాదాపు 20 వేలమంది అక్రమ వలసదారులు ఉండవచ్చని భారత రాయబార కార్యాలయం అంచనా వేసింది. ఇందులో సిరిసిల్ల, వేములవాడ, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, నిజామాబాద్, ఆర్మూర్, నిర్మల్, కామారెడ్డి, అదిలాబాద్, మెదక్ తదితర ప్రాంతాలకు చెందిన కార్మికులు ఎక్కువగా ఉంటారు. కేవలం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన దాదాపు అయిదువేల మంది కార్మికులు వీసా లేకుండా చాటుమాటుగా పనులు చూసుకుంటూ కాలం గడుపుతున్నారు. క్షమాభిక్ష కారణంగా అక్రమ వలసదారులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. అయిదేళ్ల తర్వాత యూఏఈ ప్రభుత్వం మళ్లీ అవకాశం కల్పించింది. ఈసారి గడువు రెండు నెలలు ఇవ్వడంతో అనేకమంది తిరిగి వచ్చే అవకాశం ఉంది.

● టికెట్ కోసం కార్మికుల ఆశలు...

దుబాయ్‌లో అక్రమంగా ఉంటున్న వలస కార్మికులకు టికెట్‌కు డబ్బులు లేక తిరిగి వచ్చేందుకు ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. అక్రమంగా ఉంటున్న ప్రవాస కార్మికులందరికీ టికెట్లు స్పాన్సర్ చేయాలని దుబాయ్‌లోని గల్ఫ్ కార్మికులు కోరుతున్నారు. అక్రమవలసదారులు ఎమర్జెన్సీ సర్టిఫికెట్ కోసం 60 దిర్హామ్‌లు, సర్వీస్ ఫీజు 9 దిర్హామ్‌లు చెల్లించనవసరం లేదని ఇండియన్ కౌన్సులేట్ జనరల్ ఇప్పటికే ప్రకటించింది. దీంతో అక్రమ వలసదారులకు కొంత భారం తగ్గినట్లయింది. ఇదేవిధంగా తిరిగి రావడానికి అయ్యే విమాన ఖర్చులను చెల్లించాలని దుబాయ్‌లోని పలు యూనియన్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఇప్పటివరకు అనేకమంది అక్రమ వలసదారులు వారి కుటుంబసభ్యుల ద్వారా దుబాయ్‌లో ఉండే స్నేహితులకు డబ్బులు పంపించి టికెట్ తీసుకుంటున్నారు. టికెట్‌కు డబ్బులు పంపించలేని కార్మికులకు టికెట్ ఇప్పిస్తారని ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ ఎంపికలు

హుజూరాబాద్, సెప్టెంబరు 22: ఈ నెల 23, 24న జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ సెలక్షన్స్ హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సొల్లు సారయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న అండర్-17 బాలబాలికలు, 24న అండర్-14 బాలబాలికలకు కబడ్డీ సెలక్షన్స్ జరుగుతాయని పేర్కొన్నారు. పాల్గొనే క్రీడాకారులు మండల కబడ్డీ జట్లు ప్రారంభ కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని తెలిపారు. ప్రతి టీమ్ కూడా వారి మండల ఫ్లాగ్, అర్హత ఫామ్, ఆధార్‌కార్డు జిరాక్స్ జతచేసి ఉదయం 9గంటలకు హుజూరాబాద్ హైస్కూల్ గ్రౌండ్‌లో హాజరు కావాలని కోరారు.





ఊర చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లెల జగన్మోహన్

గన్నేరువరం, సెప్టెంబరు 22: మండల కేంద్రంలోని ఊర చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లెల జగన్మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామస్థులతో కలిసి చెరువు వద్ద మీడియాతో మాట్లాడారు. గన్నేరువరం చెరువు ఏళ్ల తరబడి ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. చెరువు పక్కనే మానేరు డ్యాం, గుట్టలు, ప్రకృతివనం ఆహ్లాదకరంగా ఉన్నప్పటికీ చెరువు కట్ట అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. కట్టపై పిచ్చి మొక్కలతో నిండి వాహనాల ప్రయాణానికి సైతం ఇరుకుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరవచూపి చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కాంతాల అంజిరెడ్డి, పుల్లెల రాము, కొట్టె భూమయ్య, ఐలయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌పై విరిగిపడ్డ హైమాస్ట్ లైట్ల స్తంభం

● నిలిచిపోయిన విద్యుత్

శంకరపట్నం, సెప్టెంబరు 22: శంకరపట్నం మండలం ముత్తారం గ్రామంలో విద్యుత్ ఎల్టీ లైన్‌పై హైమాస్ట్ లైట్ల స్తంభం విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ముత్తారం రామాలయం వెనుక హైమాస్ట్ లైట్ల కోసం ఏర్పాటు చేసిన స్తంభం ఆదివారం రాత్రి వీచిన గాలికి ఆకస్మాత్తుగా విరిగి విద్యుత్ లైన్‌పై పడిపోయింది. దీంతో కన్నాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సుమారు గంటన్నర పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది విరిగిపడ్డ స్తంభాన్ని తొలగించి విద్యుత్ లైన్ పునరుద్ధరించి తిరిగి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

మున్సిపల్ అధికారుల దాడులు

- ప్లాస్టిక్ కవర్ల స్వాధీనం.. జరిమానాల విధింపు



పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

కోరుట్ల, సెప్టెంబరు 22: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న చికెన్, మటన్ దుకాణాల్లో మున్సిపల్ అధికారులు ఆదివారం సోదాలను నిర్వహించారు. దుకాణాల్లో ఉన్న ప్లాస్టిక్ నిల్వను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. ప్లాస్టిక్ కవర్లు వాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని ప్రతీ దుకాణదారులకు రూ. 2500 జరిమాన విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తిరుపతి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని యజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. కొనుగోలుకు వచ్చే వినియోగదారులు బట్ట సంచులతో రావాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలే అశోక్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఇప్పపల్లి-పోతారం అడవుల్లో సరిహద్దు వివాదం

- ఎటూ తేల్చని అటవీ, రెవెన్యూ శాఖలు
- ఏడాది కాలంగా గొడవలు
- నిత్యం యంత్రాలతో యథేచ్ఛగా అడవి ధ్వంసం


ధ్వంసమైన అడవిలో చదును చేసిన స్థలం

కథలాపూర్, సెప్టెంబరు 22: మండలంలోని ఇప్పపల్లి - పోతారం అటవీ, రెవెన్యూ సరిహద్దు వివాదం రోజురోజుకూ రాజుకుంటోంది. ఈ క్రమంలో అడవి నిత్యం విచ్చలవిడిగా నరికివేతకు గురవుతున్నా రెండు శాఖలు నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ భూమి తమకే చెందుతుందని శివారు మాదేనని ఇరు గ్రామాల ప్రజలు అడవి తల్లిపై గొడ్డలి వేటు వేస్తున్న నేపథ్యంలో వందలాది ఎకరాలు ధ్వంసానికి గురవుతున్నాయి.

- రాత్రి, పగలు తేడా లేకుండా..

రాత్రి, పగలు యథేచ్ఛగా యంత్రాలతో భూమిని చదును చేస్తుండగా అటవీ శాఖ కళ్లుండీ చూడలేకపోతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోటా పోటీగా రెండు గ్రామాలకు చెందిన వ్యక్తులు పోడుకు ప్రయత్నిస్తూ ఒకరిపైనొకరు అటవీ శాఖ కు ఫిర్యాదులు చేసుకోవడం సర్వసాధారణంగా మారిపోయింది. ఇప్పటికే ఏడాది కాలంగా అడవుల ధ్వంసంపై గొడవలు జరుగుతుండగా పోలీసు యంత్రాంగం పలుమార్లు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని ఇరువర్గాలకు సముదాయించిన ఘటనలు కూడా ఉన్నాయి. పోతారానికి చెందిన ఓ సామాజిక వర్గం తమకు శ్మశాన వాటికకు స్థలం కావాలంటూ చెట్లను ఇబ్బడిముబ్బడిగా నరికివేస్తుండగా ఇప్పపల్లి వాసులు అడ్డుకుంటున్నారు. ఈ శివారు తమకే వర్తిస్తుందని అడవిని కాపాడుకుంటామని అటవీశాఖకు చెందిన అధికారులతో ఇటీవల వాదించారు. గడిచిన ఏడాది కిందట ఇప్పపల్లి వాసులు అడవిని యం త్రాలతో ధ్వంసం చేశారని పేర్కొంటూ అటవీ శాఖ అధికారులు రు 2 లక్షల జరిమానా విధించారు. వారం రోజుల కిందట అటవీశాఖ ఉన్నతాధికారులు ఇప్పపల్లిలో సమా వేశం ఏర్పాటు చేయగా అటవీ, రెవెన్యూ సరిహ ద్దులు తేల్చాలని డిమాండ్ చేశారు. అయితే రెవెన్యూ, అటవీ శాఖల సమన్వయం లేకపోవడం వల్ల సరిహద్దు వివాదం చిలికి చిలికి గాలివానలా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ కారణంగానే భారీ విస్తీర్ణంలో అడ వి ధ్వంసం కాబడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


నరికి వేసిన చెట్లు

బీసీ కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

- బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్


మాట్లాడుతున్న ఎన్నం ప్రకాష్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 22: బీసీ కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని పద్మావతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 25న హైదరాబాద్‌లో సుందరయ్య పార్క్ నుంచి ఇందిరాపార్క్ వరకు తలపెట్టిన కులగణన మార్చ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హైకోర్టు తీర్పుతో నైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కుల గణనను ప్రారంభించడానికి రోడ్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వెంటనే కుల గణనను చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు సంపత్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గీకురు రవీందర్, రాష్ట్ర కార్యదర్శి కోడూరి పరుశురామ్ గౌడ్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి జి ఎస్ ఆనంద్, బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజురాకేశ్‌చారి, కనకయ్య గౌడ్, రాచమల్ల రాజు,దొగ్గలి శ్రీధర్, పెంట శ్రీనివాస్, ఎడ్ల సురేందర్, వంగల రవి గోపాల్, మాచర్ల అంజయ్య గౌడ్, మాదాసు సంజీవ్, కాయితోజు బ్రహ్మచారి, సుధాగోణి గణేశ్‌గౌడ్, బియ్యాని తిరుపతి, తాళ్లపల్లి మహేష్, తదితరులు పాల్గొన్నారు.


ఓసీపీ-5 పీఎల్‌ఆర్ కంపెనీ నుంచి తరలివెళుతున్న స్థానికేతరులు

రామగుండంలో 'స్థానిక' వివాదం

- ఓపెన్‌కాస్టు నుంచి తరలివెళ్లిన స్థానికేతరులు
- రెండు ఓబీ కంపెనీల్లో వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు

గోదావరిఖని, సెప్టెంబరు 22: రామగుండంలో స్థానిక నినాదం భగ్గుమన్నది. ఆర్‌జీ-1 పరిధిలోని రామగుండం నియోజకవర్గ పరిధిలోని ఓసీపీ-5, ఓసీపీ-3 రెండు ఓపెన్‌కాస్టుల్లో ఓబీ కాంట్రాక్టర్ల వద్ద 1200మంది కార్మికులు పనిచేస్తారు. ఇందులో 80శాతం స్థానికేతరులే ఉంటారు. వీరంతా ఒరిస్సా, బీహార్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి ఈ కాంట్రాక్టు కంపెనీల్లో పనిచేస్తుంటారు. ఓబీ పనుల్లో వోల్వో డ్రైవర్లుగా, టెక్నీషియన్లుగా ఇతర రాష్ట్రాల నుంచి ఉద్యోగులను తీసుకువచ్చి ఓపెన్‌కాస్టులపైనే ఓబీ కంపెనీలు గుడారాలు వేసి పని చేయిస్తుంటారు. పని స్థలాల్లో వీరు ఉండడం వల్ల పూర్తి పని సమయాల్లో కాంట్రాక్టర్లు వాడుకుంటారు. జీతాల చెల్లింపుల్లో కూడా ఓబీ కాంట్రాక్టర్లకు ప్రయోజనం ఉంటుంది. ఇది ఎన్నో ఏళ్లుగా జరుగుతున్న ప్రక్రియ, మార్పు అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తాను గెలిస్తే ఇక్కడ పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి పెంచుతామని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ చెప్పిన విధంగానే ఇప్పుడు ఆచరణ మొదలైంది. నెల రోజుల క్రితం ఓసీపీ-3 ప్రాజెక్టులో ఆర్‌వీఆర్ కంపెనీ ఓబీ కాంట్రాక్టర్ దగ్గర 600మంది పని చేస్తుంటారు. ఇందులో 500మంది స్థానికేతరులే. స్థానికులనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలని, లేకుంటే పని బంద్ చేయాలని ఎమ్మెల్యే ఆదేశాలతో 25రోజులు గత నెలలో ఆర్‌వీఆర్ ఓసీపీలో పనులు బంద్ అయ్యాయి. చివరికి 80మంది స్థానికులనే ఉద్యోగాల్లో తీసుకుంటామని, కార్మిక చట్టాల జీవో అమలుచేస్తామని హామీ ఇవ్వడంతో తిరిగి ఆర్‌వీఆర్ పనులు కొనసాగుతున్నాయి. ఈ స్ఫూర్తితో వారంరోజుల క్రితం స్థానిక కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సూచన మేరకు ఓసీపీ-5లోని పీసీ పటేల్ ఓబీ కాంట్రాక్టు పనులను కూడా బంద్ చేయించారు. ఈ అంశం డైరెక్టర్లు, సీఎండీ వరకు వెళ్లింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఓసీపీ-5లో కూడా 80శాతం మంది స్థానికులనే ఉద్యోగులుగా తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పీసీ పటేల్ కంపెనీలో పని చేసే సుమారు 600మంది స్థానికేతర కార్మికులు ఆదివారం తమ తమ ఊళ్లకు వెళ్లిపోయారు. దీంతో ఓసీపీ-5 పీసీ పటేల్ కంపెనీలో, ఓసీపీ-3 ఆర్‌వీఆర్ ఓబీ కంపెనీలో సుమారు 1000మంది స్థానికులకు ఉద్యోగాలు లభించే అవకాశం ఏర్పడింది. ఈ పరిణామం పట్ల స్థానిక నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బెంబేలెత్తిస్తున్న కుక్కలు

- గుంపులుగా వీధుల్లో సంచారం
- ప్రజలు, మూగజీవాలపై దాడులు
- అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 22: వీధికుక్కల దాడుల వరుస సంఘటనలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కొన్ని రోజులుగా ప్రతిరోజూ ఏదో ఒక చోట వీధి కుక్కలు పిల్లలు, పెద్దలు, మహిళలపై దాడుల చేసి తీవ్రంగా గాయపరుచడంతో ప్రజలు తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట, పెద్దూర్, సర్దాపూర్, రగుడు, చిన్నబోనాల, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, పెద్దబోనాల, దూప్యానాయక్ తండా, తుర్కాకాశీపల్లె, జగ్గారావుపల్లె, మాలపల్లె, బాబాజీ కాలనీ, ఇప్పలపల్లెలో కుక్కలు చెలరేగిపోతున్నాయి. దీంతో ఇళ్లలో నుంచి బయటకు రావడానికి మహిళలు, చిన్న పిల్లలు భయపడుతున్నారు. మూగజీవాలకు కూడా రక్షణ లేకుండా పోయింది. వీధుల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. ఇటీవల పెద్దూర్‌లోని పలువురు చిన్న పిల్లలపై దాడి చేసి గాయపర్చాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


సిరిసిల్ల జిల్లా పెద్దూర్‌లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు



కుక్కలతో అవస్థలు..

పెద్దూర్‌లో కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో అవస్థలు పడుతున్నాం. ప్రజలపై దాడులు చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. జనం వీధుల్లో తిరగలేని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- ఉలిసె తిరుపతి, పెద్దూర్



జనం భయపడుతున్నారు..

రోడ్లపై కుక్కల గుంపులతో గ్రామాల్లో జనం భయపడుతున్నారు. కుక్కల దాడితో చాలా మంది గాయపడుతున్నారు. బయటకు రావాడానికి జనం వణికిపోతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలి.

- జీలకిషన్‌యాదవ్, సింగిల్ విండో ఛైర్మన్

నామాపూర్‌లో గంజాయి పట్టివేత

- ముగ్గురి అరెస్టు

పెగడపల్లి, సెప్టెంబరు 22: మండలంలోని నామాపూర్ గ్రామ శివారులో ఆదివారం గంజాయి సేవిస్తున్న ముగ్గురిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పెగడపల్లి ఎస్‌ఐ రవికిరణ్ తెలిపారు. నామాపూర్ గ్రామ శివారులోని నిర్మానుష్య ప్రదేశంలో గంజాయి సేవిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది తిరుపతి, రాజేష్, సంపత్, ఎల్లయ్యలు ఒక బృందంగా ఏర్పడి గంజాయి సేవిస్తున్న తోడేటి వెంకటేష్ ధర్మపురి మండలం తిమ్మాపూర్, బుగ్గారం మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన లింగాల వంశీ, చొప్పదండి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన గుండేటి ప్రవీణ్‌లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 500 గ్రాములు గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్‌లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్‌ఐ రవికిరణ్ తెలిపారు. గంజాయి విక్రయించినా, సేవించినా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నాటుబాంబుల తయారీ ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

కోనరావుపేట, సెప్టెంబరు 22: నాటుబాంబుల తయారీ ముఠాను పోలీసులు అరెస్టు చేసినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఆదివారం వివరాలను వెల్లడించారు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన ముడిక మల్లయ్యకు చెందిన గేదె మేత మేస్తూ గడ్డిలో ఉన్న నాటుబాంబును కొరకడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధిత రైతు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ధర్మారం గ్రామానికి చెందిన పిట్టల రాజలింగం, బోనాలకు చెందిన తుమ్మల కనకరాజు, పడగల లక్ష్మీరాజం నాటు బాంబులను తయారు చేస్తూ అడవి జంతువులను వేటాడుతున్నట్లు తేలింది. వారి వద్ద 27 నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పిట్టల రాజలింగంను గతంలో రిమాండ్ పంపినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో కోనరావుపేట ఎస్సై రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

దాడి చేయడంతో మనస్తాపం ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

చందుర్తి సెప్టెంబరు 22: చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన సూత్రం ఆంజనేయులు (22) అనే యువకుడు ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నర్సింగాపూర్‌కు చెందిన ఆంజనేయులు తమ కుటుంబ అంతర్గత విషయాల్లో జోక్య చేసుకోవద్దని అదే గ్రామానికి చెందిన ఆరుగురు దాడి చేశారు. దీంతో మనస్తాపం చెంది ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో రేకుల పెడ్డుకు ఉరేసుకున్నాడు. ఆంజనేయుఉల తల్లి రాజవ్వ ఫిర్యాదుతో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బాబు తెలిపారు.

కుక్కలు అడ్డురావడంతో అదుపుతప్పిన బైక్ ఇద్దరికి గాయాలు

రుద్రంగి, సెప్టెంబరు 22: మండల కేంద్రంలో ఆదివారం బైక్ ఆదుపుతప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. కథలాపూర్ మండలం కలికోటకు చెందిన దేవరాజం ద్విచక్ర వాహనంపై చందుర్తి మండలం మల్యాల నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. రుద్రంగిలోని ఇందిరాచౌక్ వద్ద కుక్కల గుంపు బైక్ వైపు రావడంతో అదుపుతప్పి కింద పడ్డాడు. దేవరాజం కాలు విరిగింది. బైక్ వెనకాల కూర్చున్న మహిళకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వేములవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దేవుడి సొమ్ము విక్రయించే యత్నం

- స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగింత

కోల్‌సిటీ, సెప్టెంబరు 22: రామగుండం విద్యుత్‌నగర్‌లో హనుమాన్ టెంపుల్‌లో కిలోకుపైగా వెండి ఆభరణాలు చోరీ చేసి ఆ సొత్తును గోదావరిఖని స్వర్ణకారులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా ఆదివారం స్వర్ణకారులు ఇచ్చిన సమాచారంతో రామగుండం వాసులు పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు... రామగుండం విద్యుత్‌నగర్‌లోని హనుమాన్‌దేవాలయంలో రెండు రోజుల క్రితం చోరీ జరిగింది. దేవునికి అలంకరించిన కిలో వెండివస్తువులు, కొంత బంగారాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆదివారం గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని ఒక స్వర్ణకారుడిని సంప్రదించిన దొంగలు తాము వెండి వస్తువులు తీసుకువస్తామని చెప్పారు. చోరీ జరిగిన సమాచారం ఉన్న సదరు స్వర్ణకారుడు రామగుండంలోని అతని సోదరునికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆలయ పూజారితో పాటు కాలనీవాసులు ఆదివారం లక్ష్మీనగర్‌లో కాపుకాశారు. సదరు దొంగ ఆభరణాలతో రాగానే పట్టుకున్నారు. అతడిని గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

కొడుకుకు గడ్డిమందు తాగిచ్చి హత్యాయత్నం

- వివాహేతర సంబంధం బయటపడుతుందని ప్రియుడితో కలిసి ఘాతుకం

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 22: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి రూరల్ మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో ఓ తల్లి తన వివాహేతర సంబంధం బయటపడుతుందని ప్రియుడితో కలిసి కన్న కొడుకుకు గడ్డి మందు ఇచ్చి చంపాలని చూసింది. ఈ ఘటన 20 రోజుల క్రితం జరగగా దుబాయిలో ఉన్న తండ్రికి విషయం తెలియడంతో స్వగ్రామానికి చేరుకుని మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. జగ్గసాగర్ గ్రామంలో ఉంటున్న ఓ వ్యక్తి జీవనోపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం గల్ఫ్ వెళ్లాడు. అతని భార్య, కుమారుడు గ్రామంలో ఉంటున్నారు. గ్రామంలోని మరో వ్యక్తితో సదరు మహిళ కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ప్రియుడితో మహిళ కలిసి ఉండటాన్ని కుమారుడు ఒకరోజు చూసాడు. దీంతో తన బండారం బయటపడుతుందని కొడుకును అడ్డు తొలగించుకోవాలని ఆమె నిర్ణయించుకుంది. వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తితో కలిసి మహిళ తన కొడుకుకు ఈనెల 2వ తేదీన బలవంతంగా గడ్డి మందు తాగించింది. అనుమానం రాకుండా ఉండేందుకు ఆరోగ్యం బాగా లేదని గ్రామంలోని ఆర్ ఎంపీతో మూడు రోజులు చికిత్స చేయించింది. పరిస్థితి విషమించడంతో మెట్‌పల్లిలోని ఆసుపత్రికి తరలించింది. వైద్యులు పరీక్షలు చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించాలని సూచించారు. ప్రస్తుతం నిజాబామాద్‌లో ప్రాణాపాయ స్థితిలో యువకుడు చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న యువకుడి తండ్రి గల్ఫ్ నుంచి ఇటీవల వచ్చి అసలు విషయం ఏంటని ఆరా తీశాడు. భార్య విషయం బయటపడడంతో ఆదివారం మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దరాప్తు చేస్తున్నారు.

గోదావరిలో మృతదేహం లభ్యం

ఫైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 22: గోదావరినదిలో ఆదివారం సాయంత్రం ఓ వ్యక్తి మృతదేహం లభించినట్టు గోదావరిఖని టుటౌన్ పోలీసులు తెలిపారు. మృతుడు మంచిర్యాల జిల్లాకు చెందిన సాటం వెంకటేష్(32)గా గుర్తించినట్టు పేర్కొన్నారు. మృతుడు మంచిర్యాలటౌన్‌లో ఇంటర్‌నెట్ షాపు నడుపుకుంటూ జీవిస్తుంటాడని, ఓ హత్య కేసులో జైలుకు వెళ్లి వారం రోజుల క్రితం కండీషన్ బెయిల్‌పై వచ్చిన అతడు నదిలో మృతదేహంగా మారినట్టు తెలిపారు. వెంకటేష్ ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎవరైనా హత్య చేసి ఉంటారా అనేది తేలాల్సి ఉందని, ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. మృతుడి బంధువుల్లో ఒకరు మృతదేహాన్ని చూసి వెంకటేష్‌గా గుర్తించారన్నారు.

ఇళ్ల చుట్టూ ఎస్సారెస్పీ కెనాల్ నీళ్లు


ఇంటి చుట్టూ చేరిన కెనాల్ నీళ్లు

మంథనిరూరల్, సెప్టెంబరు 22: మండలంలోని కన్నాల గ్రామంలో ఎస్సారెస్పీ కెనాల్ నీళ్లు ఇళ్ల చుట్టూ వచ్చి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలో పూడిక పూడిక పెరుకుపోవడంతో నీళ్లు ఇళ్ల మధ్యకు వస్తున్నాయి. జంగిలి బుజ్జమ్మ, జంగిలి రాధమ్మతో పాటు పలువురి ఇళ్లల్లోకి నీరు రావడంతో ఇబ్బందులు పడుతున్నారు.

డ్రైవర్ విధులకు ఆటంకం కలిగించిన ఆర్ఎంపీపై కేసు నమోదు

- ఆర్టీసీ బస్సు ఇంటి వద్ద ఆపలేదని వివాదం


పోలీస్‌స్టేషన్ ఎదుట నిలిపిన ఆర్టీసీ బస్సు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 22: ఆర్టీసీ బస్సు డ్రైవర్ విధులకు ఆటంకం కలిగించిన మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ తాడూరి రాజేశంపై కేసునమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం కరీంనగర్ నుండి ఇల్లంతకుంట మీదుగా జేబీఎస్‌కు ఆదివారం బయలుదేరింది. ఇల్లంతకుంటలోని బస్టాండులో రాజేశం బస్సు ఎక్కి మార్గమధ్యలోని తన ఇంటివద్ద ఆపాలని కోరాడు. డ్రైవర్ ఇంటివద్ద కొంత సమయం బస్సును ఆపినా ఇంట్లోని వారు రాకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారని డ్రైవర్ తెలిపాడు. దీనితో ఆవేశానికి లోనైన రాజేశం డ్రైవర్‌ను దుర్భాషలాడుతూ దాడి చేసేందుకు వెళ్లాడు. డ్రైవర్ ఆర్టీసీ బస్సును తీసుకొని నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. డ్రైవర్ శెట్టి తిరుమలరాజు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 22: కరీంనగర్‌లోని రాజీవ్ చౌక్ వద్ద న్యూ పీకాక్ రెస్టారెంట్‌లో ఆదివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. రెస్టారెంట్‌లోని కిచెన్‌లో చిమ్ని వద్ద పెద్దఎత్తున పొగలు రావడంతో సిబ్బంది వెంటనే కరీంనగర్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో ఫైర్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సంఘటనలో 2 లక్షల రూపాయలకు పైగా నష్టం వాటిల్లినట్టు కరీంనగర్ డివిజన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అగ్నిప్రమాద ఘటనపై విచారణ జరుపుతున్నామని ఆయన తెలిపారు.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

బస్సులో రూ. 2 లక్షలు మర్చిపోయిన ప్రయాణికుడు

- అందజేసిన మంథని డీఎం శ్రావణ్‌కుమార్


రమేశ్‌కు డబ్బులు అందజేస్తున్న డీఎం శ్రావణ్‌కుమార్

మంథని, సెప్టెంబరు 22: ఆర్టీసి బస్సులో ప్రయాణికుడు మర్చిపోయిన రూ. 2 లక్షలను మంథని డీఎం శ్రావణ్‌కుమార్ ఆదివారం అప్పగించారు. మంథని డిపోకు చెందిన బస్సు గోదావరిఖని నుంచి భూపాలపల్లికి వెళ్తుండగా మార్గమధ్యలో కాటారంలో జే రమేశ్ అనే ప్రయాణికుడు ఎక్కాడు. ఈక్రమంలో తన వెంట ఉన్న కవర్‌లో రూ. 2 లక్షలను సీటులోనే ఉంచి మర్చిపోయి భూపాలపల్లిలో దిగిపోయాడు. డబ్బులను గమనించి భూపాలపల్లి డిపోలో సెక్యూరిటీ సిబ్బందిని కలిసి సమాచారం ఇచ్చారు. వారు మంథని డీఎంకు సమాచారం ఇవ్వడంతో బస్సును గుర్తించి కండక్టర్ ద్వారా సదురు నగదు ఉన్న కవర్‌ను గుర్తించి తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. ఈమేరకు సమాచారం ఇవ్వడతో రమేశ్ మంథనికి వచ్చి తన రూ. 2 లక్షల నగదు కవర్‌ను డీఎం శ్రావణ్‌కుమార్ నుంచి స్వాధీనం చేసుకున్నారు. మర్చిపోయిన తన రూ. 2 లక్షలను తిరిగి క్షేమంగా అప్పగించిన డీఎం శ్రావణ్‌కుమార్, కండక్టర్ తిరుపతమ్మ, డ్రైవర్ మొగిలికి రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆదమరిస్తే అంతే..

- వల్లంపహాడ్, ఇరుకుల్ల బ్రిడ్జిలపై ప్రమాదకరంగా గుంతలు
- రాకపోకలకు వాహనదారులు అవస్థలు


ఇరుకుల్ల వంతెనపై తేలిన ఇనుప చువ్వలు

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 22: కరీంనగర్ శివారులోని ప్రధాన రహదారిపై రోడ్లు అధ్వాన్నంగా మారాయి. కరీంనగర్ మండల శివారులోని ప్రధాన రాజీవ్ రహదారిపై, కరీంనగర్ నుంచి మంచి ర్యాల ప్రధాన రహదారి వల్లంపహాడ్ బ్రిడ్జిపై రహదారి ప్రమాదకరంగా మారింది. ఇరుకుల్ల వంతెనపై పలు చోట్ల గుంతలు ఏర్పడి తరచూ ప్రమ వాదాలు జరుగుతున్నాయి. కరీంనగర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్లే రహదా రిపై వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వల్లంపహాడ్ బ్రిడ్జి మూల వద్ద ఏర్పడిన భారీ గుంత ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డు సేఫ్టీ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వల్లంపహాడ్ బ్రిడ్జి బ్రిడ్జిపై, ఇరుకుల్ల బ్రిడ్జి రహదారిపై మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత


వల్లపహాడ్ బ్రిడ్జిపై ప్రమాదకరంగా ఉన్న గుంత



లాభాల వాటాపై బీఆర్ఎస్ అసత్యపు ఆరోపణలు

- అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్న నాయకులు

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, సెప్టెంబరు 22: సింగరేణి చరిత్రలో ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా చెల్లిస్తే కొంత మంది బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని రామగుండం ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌రాజ్‌ఠాకూర్ విమర్శించారు. సింగరేణి కార్మికుల విషయంలో ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నదని, కాంగ్రెస్ పార్టీ మీద మాజీ మంత్రి కేటీఆర్ ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారని చెప్పారు. పదేళ్లుగా సింగరేణి సంస్థను బీఆర్ఎస్ పార్టీ నిర్లక్ష్యం చేసిందని, గనులను మూసివేసి ఓపెన్ కాస్టులను ప్రారంభించిందని, సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాల కోసం టీబీజీకేఎస్ నాయకులు లక్షలాది రూపాయలు లంచాలు తీసుకుని కొంతమంది నాయకులు జైలుకు వెళ్లారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి చూడలేక బురదజల్లుతున్నారని, బీఆర్ఎస్ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

ఓసీపీ-3ని సందర్శించిన టీబీజీకేఎస్ నేతలు



కార్మికులతో మాట్లాడుతున్న ఐలి శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 22: సింగరేణి సంస్థ ఆర్జీ-2 డివిజన్ పరిధిలోని ఓసీపీ-3 ప్రాజెక్టును ఆదివారం టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, ఆర్జీ-2 ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం, జాతీయ సంఘాలు కార్మికులకు అంకెల గారడీతో మాయమాటలు చెప్పి మోసంచేశాయని ఆరోపించారు. సింగరేణి వాస్తవ లాభాలు రూ.4,701 కోట్లుగా ప్రకటించినప్పటికీ ప్రభుత్వం సింగరేణి మనుగడ కోసం రూ.2,780 కోట్లు పక్కకు పెట్టి మిగతా డబ్బులు 33శాతం పెంచి ఇస్తున్నట్లు చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. సింగరేణిలో ప్రస్తుతం గెలిచిన సంఘాలు, ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కుమ్మక్కై కార్మికులను మోసం చేశాయని ఆరోపించారు. లాభాల వాటా మోసంపై టీబీజీకేఎస్ పక్షాన ప్రభుత్వం, సింగరేణిపై ఒత్తిడి పెంచేందుకు కార్యాచరణ తీసుకున్నట్లు తెలిపారు. సోమవారం నల్లబ్యాడ్జీలతో నిరసన, జీఎం కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యం, చంద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, శ్రీనివాస్, తిరుపతి, నరేందర్, రమేశ్, రాకేష్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రకటనలకే పరిమితమైన ఆరు గ్యారంటీలు

పాలకుర్తి, సెప్టెంబరు 22: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల వాగ్దానం ప్రకటలనే పరిమితమైందని బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి ముల్కల్ల కొమురయ్య అన్నారు. ఆదివారం పాలకుర్తి ప్రెస్ భవన్‌లో మండల బీఆర్ఎస్ శ్రేణులు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో పాల్గొన్న ముల్కల్ల కొమురయ్య మాట్లాడారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కావాలని రైతులు రోడ్డు ఎక్కి ఆందోళనలు చేస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం విచారకరమన్నారు. నిజంగా రైతులపై ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా పూర్తిస్థాయిలో రుణమాఫీ అందించి వారి నిజాయితీ నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో కేశోరాం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, నాయకులు మదన్‌మోహన్‌రావు, బైరి రామకృష్ణ, మాదాసు సతీష్, ఉస్సేన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్ల ఇళ్లలో పోలీసుల తనిఖీలు



రౌడీషీటర్లను విచారిస్తున్న పోలీసులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 22: గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ఆదివారం రౌడీషీటర్ల ఇళ్ల వద్ద తనిఖీలు నిర్వహించారు. సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు రమేష్, భూమేష్‌లు నాలుగు టీములుగా విడిపోయి ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు తనిఖీలు చేశారు. సుమారు 35మంది రౌడీషీటర్లు ఎక్కడ ఉంటున్నారు, ఏం చేస్తున్నారు, వారి నడవడిక, ప్రవర్తన గురించి ఆరాతీశారు. ఇళ్లలో కత్తులు, పేలుడు పదార్థాలు, గంజాయి డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలు ఉన్నాయా అని తనిఖీ చేశారు. మంచి ప్రవర్తనతో ఉండాలని, ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా సహించేది లేదని వారిని సీఐ హెచ్చరించారు.

'కాంగ్రెస్ నేతలే కాపాడుతున్నారు'

మంథని, సెప్టెంబర్ 22: అక్రమ వసూళ్లు, బెదిరింపులకు పాల్పడుతున్న ఇనుముల సతీష్‌ను కాపాడుతుంది కాంగ్రెస్ పార్టీ నేతలేనని బీఆర్ఎస్ నేత తగరం శంకర్‌లాల్ ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇనుముల సతీష్ వ్యవహారంలో ఈ ప్రాంతానికి నాయకత్వం వహిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబే బాధ్యత వహించాలన్నారు. ఇనుముల సతీష్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార పార్టీ ప్రతినిధిగా ప్రచారం చేసుకొని అనేక కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన సతీష్ బెదిరింపులతో లక్షలాది రూపాయాలు వసూలు చేసి కేసుల పాలైన ఇప్పటి ఎందుకు అరెస్టు చేయదన్నారు. కేసుల్లో ఏ-2గా ఉన్న రావికంటి సతీష్‌ను అరెస్టు చేసిన పోలీసులు ఏ-1గా ఉన్న ఇనుముల సతీష్‌ను ఎందుకు అరెస్టు చేయటానికి కావాలనే కాలయాపన చేస్తున్నారన్నారు. మంత్రి అండ చూసుకునే సతీష్ అక్రమాలకు పాల్పడ్డారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు బెల్లంకొండ ప్రకాష్‌రెడ్డి, పెగడ శ్రీనివాస్, కాయిత సమ్మయ్య, సదానందం, రవిలు పాల్గొన్నారు.

అన్నపూర్ణ రిజర్వాయర్‌కు ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 22: ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీటి ఎత్తిపోలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.98 టీఎంసీలకు చేరుకున్నాయి. మిడ్‌మానేరు ద్వారా వచ్చిన 3200 క్యూసెక్కుల నీటిని ఒక పంపు ద్వారా ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఏఐటీయూసీ పోరాటాలతోనే రూ.5వేల బోనస్

- లాభాల్లో కాంట్రాక్టు కార్మికుల శ్రమ ఉంది.. - యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

గోదావరిఖని, సెప్టెంబరు 22: సింగరేణికి వచ్చిన లాభాల్లో కాంట్రాక్టు కార్మికుల శ్రమ ఉందని, వారికి కూడా లాభాల్లో వాటా ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యంపై ఏఐటీయూసీ ఒత్తిడి చేయడం వల్లనే కాంట్రాక్టు కార్మికులకు రూ.5వేల బోనస్ వచ్చిందని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య చెప్పారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణిలో అతితక్కువ వేతనంతో పనిచేస్తూ కాంట్రాక్టు కార్మికులుగా, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా సింగరేణి వ్యాప్తంగా 25వేల మంది శ్రమజీవుల కష్టం తోడైతేనే సింగరేణి లాభాలు వచ్చాయని చెప్పారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెరగాలని ఒకవైపు పోరాడుతూనే లాభాల్లో రూ.5వేల బోనస్ ఇప్పించిన ఘనత ఏఐటీయూసీదేనన్నారు. నాడు పర్మినెంట్ కార్మికులకు ఈ హక్కును కల్పించినట్టుగానే ఇప్పుడు కాంట్రాక్టు కార్మికులకు ఇప్పించామని చెప్పారు. ఏఐటీయూసీ సాధించిన లాభాల వాటా హక్కు ప్రభుత్వంలో ఎవరు ఉన్నా సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఏ యూనియన్ ఉన్నా లాభాల వాటా హక్కు కొనసాగుతూ వస్తున్నదని, దీన్ని తప్పనిసరి చేసింది ఏఐటీయూసీ అని సీతారామయ్య చెప్పారు. గత 25 సంవత్సరాలుగా సింగరేణికి వచ్చిన నికరలాభాల నుంచి మాత్రమే వాటా ప్రకటిస్తున్నారని, స్థూల లాభాల నుంచి కాదని అదే పద్ధతిలో ఈ సంవత్సరం కూడా నికర లాభాల నుంచి 33శాతం వాటా తీసుకువచ్చామన్నారు. కొందరు 16 శాతం చెల్లిస్తున్నారని, మిగతా సొమ్ము ఏం చేస్తున్నారని ప్రశ్నించడం దుష్ప్రచారం తప్ప మరొకటి కాదని సీతారామయ్య చెప్పారు. కార్మికులను తప్పుదోవ పట్టించడం, తమ పబ్బం గడుపుకోవడానికి టీబీజీకేఎస్ లాంటి సంఘాలు చేస్తున్న దుష్ప్రచారమన్నారు. ఈ అంశంపై కొందరు అవగాహన లేని వ్యక్తులు కాకి లెక్కలు చెబుతూ కార్మికులను మోసం చేయడం సరికాదన్నారు. గత పది సంవత్సరాలు గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ కాంట్రాక్టు కార్మికులకు ఏం చేసిందని ప్రశ్నించారు. ఇప్పటికైనా టీబీజీకేఎస్, ఇతర సంఘాల నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని, గుడ్డిగా ఏఐటీయూసీని విమర్శిస్తే బాగుండదని ఆయన హెచ్చరించారు. సింగరేణి మిగులు లాభం 67శాతం నుంచి కాంట్రాక్టు కార్మికులకు బోనస్, వరద బాధితులకు రూ.10.25కోట్ల సహాయం ఇప్పించేందుకు యాజమాన్యాన్ని ఒప్పించామని చెప్పారు. కార్మికుల జీతాల నుంచి ఎలాంటి కోత ఉండదన్నారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులంతా ఐక్యంగా ఏఐటీయూసీ వెంట ఉండి పోరాటాలకు కలిసి రావాలని ఆయన కోరారు. కాంట్రాక్టు కార్మికుల వేతనాలు తెచ్చే విషయంలో కూడా ఏఐటీయూసీ కృషి చేస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం, ఎస్ వెంకటరెడ్డి, బుర్ర తిరుపతి, ఎంఏ గౌస్, ఏబీఎస్ ప్రకాష్, ఇనుముల రాజమౌళి, పడాల కనకరాజు, చెప్యాల మహేందర్‌రావు, శివ, రాజనర్సు, తిరుపతి, ఊదరి రవి తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటా మోసంపై దశలవారీ ఆందోళన

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, సెప్టెంబరు 22: కార్మికులకు లాభాల వాటా చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం చేసిన మోసానికి వ్యతిరేకంగా సింగరేణి వ్యాప్తంగా దశలవారీ నిరసన పోరాటాలు చేస్తామని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి చెప్పారు రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ప్రకటించిన రూ.4,701కోట్లపైన 33శాతం వాటా చెల్లించకుండా కేవలం రూ.2,412కోట్ల లాభాలను ప్రకటించడంతో రాష్ట్ర ప్రభుత్వానికి సింగరేణి కార్మికులపై ప్రేమ లేదని రుజువైందన్నారు. ఆదివారం గోదావరిఖనిలోని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణి కార్మికులకు నికర లాభాలపై 33శాతం రూ.1550కోట్లు వాటాగా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 23న నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. 24న రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం, 25న జీఎం కార్యాలయాల ముందు ధర్నాలు చేస్తామన్నారు. 26వ తేదిన కార్మికులతో సంతకాల సేకరణ నిర్వహించి ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులకు పంపిస్తామని చెప్పారు. ఇప్పటికైనా కార్మికుల మనోభావాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకుంటే హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ఎదుట ధర్నా చేస్తామని రాజిరెడ్డి హెచ్చరించారు. ఏఐటీయూసీ నాయకుడు వాసిరెడ్డి సీతారామయ్య ఇతరులను నిందించే ముందు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని రాజిరెడ్డి అన్నారు. 2023-24లో బొగ్గు ధర పెరిగిన విషయాన్ని, 30లక్షల టన్నుల బొగ్గు అధికంగా ఉత్పత్తి చేసిన విషయాన్ని గమనంలోకి తీసుకుని మాట్లాడాలని రాజిరెడ్డి సూచించారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, కేంద్ర నాయకులు చల్లా రవీందర్‌రెడ్డి, పింగళి సంతప్‌రెడ్డి, ఆర్జీ-1 ఉపాధ్యక్షులు వడ్డేపల్లి శంకర్, నాయకులు ఉప్పులేటి తిరుపతి, మీస రాజు, భాస్కర్, సత్యనారాయణ, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన మన ఊరు మన బడి పనులు..



జయ్యారంలో గోడలకే పరిమితమైన భోజనశాల..

పాలకుర్తి,సెప్టెంబర్ 22: గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మన బడి పనులు మండలంలో నత్తనడకన నడుస్తున్నాయి. మండలం పరిధిలోని జయ్యారం హై స్కూల్, జీడినగర్ ప్రైమరీ స్కూల్, రామరావుపల్లి యూపీఎస్, బసంత్‌నగర్ తెలుగు మీడియం ప్రైమరీ పాఠశాల, కన్నాల హై స్కూల్, ప్రైమరీ స్కూల్ పాఠశాలల్లో మన ఊరు మన బడి కార్యక్రమం కింద లక్షలు వెచ్చించి పనులను ప్రారంభించారు. అయితే నిధులు మంజూరు కాకనో లేదా ఇతర కారణాలు ఏమైనా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆరోపణలను ఖండిస్తున్నాం : ఏఐటీయూసీ

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 22: తమ యూనియన్‌కు చెందిన నాయకులు మైనింగ్ సిబ్బందిని బెదిరిస్తున్నారని కొన్ని కార్మికసంఘాల నాయకులు ఆరోపించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మా బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య గని మేనేజర్‌తో మాట్లాడుతున్న సందర్భంలో మైనింగ్‌స్టాఫ్ సూపర్‌వైజర్ జోక్యం చేసుకోవడంతో వారి నడుమ వాగ్వాదం జరిగిందన్నారు. వెంటనే తాము మైనింగ్‌స్టాఫ్ నాయకులతో మాట్లాడి సమస్య పరిష్కరించామన్నారు. పనిస్థలాల్లో మనస్పర్థలు రావడం సహజమేనని, కొంతకాలానికి అవి సమసిపోతాయన్నారు. ఇతర సంఘం నాయకులు వాటిని పెద్దవి చేయడం తగదని హితవు పలికారు.

'సింగరేణి శ్వేతపత్రం విడుదల చేయాలి'

శ్రీరాంపూర్, సెప్టెంబరు 22: గతఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాలపై సింగరేణి శ్వేతపత్రం విడుదల చేయాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియా ముఖ్యకార్యకర్తల సమావేశం ఆదివారం యూని యన్ కార్యాలయంలో నిర్వహించగా, ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంస్థ సాధిం చిన లాభం నుంచి 33శాతం చెల్లిస్తామని చెప్పిన యాజమాన్యం కేవలం 16.9శాతం మాత్రమే ఇవ్వడం సరికాదన్నారు. లాభాలపై శ్వేతపత్రం విడుదల చేసి మిగతాడబ్బులు కార్మికులకు అందించాలని కోరారు. సమావేశంలో బీఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి, నాయకులు రాగం రాజేందర్, పురుషోత్తం చారి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు వరం...

ఐదువేల రూపాయల లాభాలవాటా కాంట్రాక్టు కార్మికులకు వరమని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి మేకల దాసు అన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో ఓబీకార్మికులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భవిష్యత్తులో ఈ వాటా మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. సమావేశంలో సర్వ శ్రీనివాస్, నర్సింగ్, రాజేశ్, శ్రీనివాస్, వేణు,రమేష్, తిరుపతి పాల్గొన్నారు.

లాలపల్లిలో కొప్పరవానికుంటకు మరమ్మతులు



అధికారులు పూడ్చివేసిన కొప్పరవానికుంట గండి

ఎలిగేడు, సెప్టెంబర్ 22: ఎట్టకేలకు మండలంలోని లాలపల్లి గ్రామంలోని కొప్పరవాని కుంట ఎట్టకేలకు మరమ్మతులకు నోచుకుంది. ఇటీవల భారీ వర్షాలకు నీటి ప్రవాహం ఎక్కువై కట్టకు గండి పడింది. దీంతో కట్టపై నుంచి పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నీటి ప్రవాహానికి గండి పడగా కింది పొలాలు నీటమునిగి దెబ్బతిన్నాయి. పొలాలపై ఇసుక మేటలు ఏర్పడి పదుల సంఖ్యలో రైతులు తీవ్రంగా పంట నష్టపోయారు. విషయాన్ని గ్రామస్థులు, అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే మైనర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించగా, వారు మూడురోజుల్లో గండి పూడ్చారు. పనులు పూర్తిచేయించిన ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావుకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పంట నష్టపరిహారం ఇప్పించాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు.

మృత్యువులోనూ వీడని బంధం

- గంటల వ్యవధిలో అన్నదమ్ముల మృతి
- పాతగూడురులో విషాదం..

ఎండపల్లి, సెప్టెంబర్ 22: మృత్యువులోనూ అన్నదమ్ముల బంధం వీడలేదు. తమ్ముడు మృతిచెందిన విషయాన్ని జీర్ణించుకోలేక అన్న కూడా తీవ్ర మనోవేదనకు గురై 24 గంటలు గడవక ముందే అన్న కూడా తుది శ్వాస విడిచిన ఘటన జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని పాతగూడూరులో విషాదం నింపింది. గ్రామస్థులు తెలిపిన కథనం మేరకు.. గ్రామానికి చెందిన రెడ్డిమల్ల నర్సయ్య(75), రెడ్డిమల్ల వెంకటయ్య(77) ఇద్దరూ అన్నదమ్ములు. కొన్నిరోజుల క్రితం తమ్ముడు నర్సయ్య గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ సర్జరీ చేయించుకున్నాడు. పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతిచెందాడు. నర్సయ్య దహన సంస్కారాల్లో పాల్గొన్న అన్న వెంకటయ్య తమ్ముడు తనను విడిచి పోయాడంటూ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. కుటుంబ సభ్యులతోనూ తమ్ముడి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ బాధపడ్డాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లోనూ ఒక్కసారిగా కుప్ప కూలి మృతిచెందాడు. 24 గంటలు గడవక ముందే అన్న దమ్ములు మరణించడంతో కుటంబంలో విషాద చాయలు అలుముకున్నాయి.

కాలువలో పిచ్చి మొక్కల తొలగింపు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 22: పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామానికి ఆనుకొని ఉన్న కాలువలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు పెద్దకల్వల గ్రామ పంచాయతీ కార్యదర్శి నిశాంత్‌రావు జేసీబీ సహాయంతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సదయ్యగౌడ్‌కు పురస్కారం



జీవిత సాఫల్య పురస్కారం అందుకుంటున్న సదయ్య గౌడ్

సుల్తానాబాద్, సెప్టెంబరు22: సుల్తానాబాద్ కేంద్రంగా పెద్దపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఏగోలపు సదయ్యగౌడ్‌కు ఆదివారం జీవిత సాఫల్య పురస్కారం అందించారు. హైదరాబాద్ తిలక్ రోడ్డులోని డాక్టర్ రామానుజ రావు కళామందిరం, తెలంగాణ సారస్వత పరిషత్ భవనంలో ఆదర్శ కళానిలయం వారి 28వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఏగోలపు సదయ్య గౌడ్ సేవలను గుర్తించి ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో కళానిలయం అధ్యక్షులు చర్ల ప్రకాశ్, సీఐడి ఎస్పీ భూక్య రాంరెడ్డి పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడిగా రామకృష్ణ

సుల్తానాబాద్, సెప్టెంబరు 22: సుల్తానాబాద్ మండల ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడిగా పూసాల రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సుల్తానాబాద్‌లో సమావేశమైన ఫొటో వీడియో గ్రాఫర్లు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వడ్లకొండ శశివర్ధన్, కోశాధికారి గా మేరుగు హరీష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు పోగుల విజయ్ కుమార్ మాట్లాడుతూ ఐక్యతతో సంఘ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి కోసం కృషి చేస్తామన్నారు. ప్రతీ సభ్యులు కుటుంబ భరోసాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్ఫాన్, కుర్మ రమేష్, గంధం రాజేష్, బిట్ల రమేష్, రాజు, వినోద్, తిరుపతి, సంపత్, చింటూ, శివ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సుల్తానాబాద్, సెప్టెంబరు 22: సుల్తానాబాద్ మండలంలోని రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ అన్నేడి మహిపాల్‌రెడ్డి కుటుంబాన్ని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకురాలు దాసరి ఉష పరామర్శించారు. మహిపాల్‌రెడ్డి ఇటీవల గుండె పోటుతో మరణించారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని కలసి ఓదార్చారు. రాష్ట్ర నాయకులు నల్ల మనోహర్‌రెడ్డితో పాటు మండల నాయకులు గట్టు శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని వేర్వేరుగా పరామర్శించారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

సుల్తానాబాద్, సెప్టెంబరు 22: మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన చీకటి ఓదెలు కుటుంబానికి గ్రామస్తులు యాభై కిలోల బియ్యం అందించారు. ఓదెలు ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందగా, బార్య నరసమ్మ కూడా ఆనారోగ్యంతో పని చేయలేని స్థితిలో ఉండడంతో ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు యాభై కిలోల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మండల రమేష్, న్యాయవాది మంగళంపల్లి భానుచందర్, సది, ప్రభాకర్, దేవేందర్, లక్ష్మణ్, శ్రీకాంత్ రాజయ్య తనవీన్, నాగరాజు, నరేష్ దితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మిత్రుల చేయూత

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 22 : మండలంలోని ముత్తారం గ్రామ పంచాయతీ ధర్మాబాద్ గ్రామానికి చెందిన న్యాలం రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఇండియా మిషన్ హైస్కూల్‌లో 2000-01 లో తనతో చదువుకున్న బాల్య మిత్రులు వారి కుటుంబానికి అండగా నిలిచారు. ఆదివారం బాల్యమిత్రులు అందరు కలిసి రూ.22వేలు జమ చేయగా అందులో మృతుని కూతురు న్యాలం వెన్నెల పేరుపై 20వేలు ఫిక్సడ్ డిపాజిట్ చేసి రూ.2 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో మిత్రులు మంథని కృష్ణ, అల్లాడి హరిబాబు. ఎండి జహంగీర్, సంకిస ఆంజనేయులు, సాగర్, నల్లగొండ కుమార్, తీగల రమేష్‌లు పాల్గొన్నారు.

టైలరింగ్ సామగ్రి పంపిణీ



కత్తెర్లు పంపిణీ చేస్తున్న రేండ్ల శారద కుమారస్వామి

రామగిరి, సెప్టెంబరు 22: మండలంలోని కల్వచర్ల రేండ్ల శారద కుమారస్వామి సౌజన్యంతో రెండు నెలల పాటు టైలరింగ్‌లో శిక్షణ పొందిన గ్రామానికి చెందిన 76 మంది మహిళలకు టైలరింగ్ సామాగ్రిని పంపిణీ చేపట్టారు. ఆదివారం గ్రామంలోని టైలరింగ్ శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రేండ్ల శారద కుమారస్వామి చేతుల మీదుగా మెజర్‌మెంట్ టేప్‌తో పాటు కత్తెరలను పంపిణీ చేపట్టారు. శిక్షణ పొందిన మహిళలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని రేండ్ల శారద ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బూస బాపన్న, మల్యాల మోహన్, జగన్, తోట గోపాల్, రాపెల్లి లక్ష్మణ్ పెద్దసంఖ్యలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 22: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సోమవారం బ్లాక్ డే పాటించాలని కరపత్రాలను ఆదివారం స్థానిక బస్టాండ్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు కె.విశ్వనాథ్, ఏఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి, రాములు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పట్టణ, మండల కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమంలో కార్మికులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సిపెల్లి రవీందర్, నాయకులు వెంకటస్వామి, అశోక్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌బీ పార్టీలో చేరిన సురేందర్ సన్నీ

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 21: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో దళిత, ప్రజా సంఘాల నాయకుడు బొంకూరి సురేందర్ సన్నీ చేరారు. కరీంనగర్ లో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బండ శేఖర్ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్ రెడ్డి సన్నీకి ఆదివారం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా సన్నీ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీలోకి ఆహ్వానించిన బండ సురేందర్ రెడ్డి, బండారి శేఖర్ లకు సురేందర్ సన్నీ కృతజ్ఞతలు తెలిపారు.

రాజన్నకు భక్తుల మొక్కులు



రాజన్న దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 22 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించిన భక్తులు క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకొని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం రాజన్నకు అత్యంత ప్రీతి పాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో వినోద్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు